# మనిషి వంటి మనిషి

జీతం తీసుకొని ఇంకా ఒక రోజన్నా పూర్తికాలేదు. హేండ్సప్! జేబులో కానీ లేదు! నూరు కాగితాలు ... అలా చెల్లిపోయాయి ఏమైపోయాయి? తను ఖర్చు పెట్టేశాడా? ఎలా ఖర్చు పెట్టేశాడు? ఆడపిల్లలకు ఇచ్చేశాడా? అంగడిలో అప్పు తీర్చేశాడా? చక్కని ఖరీదైన బట్టలు కుట్టించి తొడిగేసి సరదా తీర్చుకున్నాడా? హోటల్లో మంచి టిఫిన్లుతిని, డ్రింకులు త్రాగి, సిగరెట్లు కాల్చి జల్సా చేసేశాడా? స్నేహితులతో సినిమాలకువెళ్లి "ఖుషీ" చేసేశాడా?

లేదు! తనేమీ చేయలేదు. ఒక్క పైసా కూడా తనకోసం ఉపయోగించుకోలేదు. ఒక్క పైసా తన అర్ధాంగికి ఇవ్వలేదు. ఒక్క పైసాతో తాము ఏ సుఖాన్నీ, ఆనందాన్నీ కొనుక్కోలేదు. ఏ ఒక్క పైసాతోటి తాము సంతోషం పొందలేదు. మరేమయింది? కుటుంబమనే రాక్షసి ప్రతి కానీ మింగేసింది! మింగిన క్షణంలో హరించుకొని మళ్లీ ఆకలితో, నోరు తెరుచుకుంది! ఆ ఆకలి తీర్చమని వేధించడంకూడా ఆ క్షణాన్నే ప్రారంభించింది. ఆ ఘోరమైన ఆకల్ని తీర్చడం తనలాంటి 'ఒక్కడికి', బలహీనుడికి సాధ్యమయ్యే పని కాదు. కానీ...ఆ పిశాచి ఆ విషయం బోధపరచుకోదు. తనని పీక్కుతింటూనే వుంది. క్షణక్షణం ఊపిరి సలుపనీకుండా, మనశ్శాంతి నివ్వకుండా గోల పెడుతూనే వుంటుంది. 'నీకు...ఈ దుర్భరావస్థ... ఇంకా బ్రతికే వున్నావే?' అని హింసిస్తూనే వుంటుంది.

తను కూడా చీమూ రక్తమూ వున్నటువంటి ఒక మనిషే! తనకూ కోరికలూ, ఆశలూ వున్నాయి. తనకూ సుఖించాలనీ, ప్రశాంతంగా వుండాలనీ వుంటుంది. కుటుంబంలో అందరూకూడా సుఖంగా, హాయిగా వుండాలనీ వుంటుంది. ఆ విషయాన్ని ఈ కుటుంబమనే పిశాచి, రాక్షసి, క్రూరజంతువు ఎందుకు గుర్తించదు?

ఇదివరలో, ఇంతమంది తనలాంటి మనుష్యులతో, ప్రాణమూ, మనసూ వున్నటువంటి కోటి ప్రాణులలో ఒక్కరైనా ఎందుకు గుర్తించరు? తనను ఎందుకిలా పిండిప్రంపకొట్టి ఉప్పూ కారం వేసుకొని నంజుకొని తింటారు?

ఇది యిలా జరుగుతుందని తను ముందుగా కనీసం చూచాయగానైనా తెలుసుకో గలిగి వుంటే యెంత బావుండేది! ఈ ఉద్యోగంలో ప్రవేశించకుండావుండి, మరో మంచి ఉద్యోగం చూసుకోవడమో, ఏదైనా 'కోర్సు' చదవడమో చేసి వుంటే ఎంత బాగా వుండేది! ఈ దారుణమైన పని, హింస...ఎలా భరించడం? ఇదంతా ఎవరికి బోధపడుతుంది? ఇంట్లో ప్రతీవాళ్ళూ తను వీలయినంత 'అర్జెంటు'గా డబ్బు సంపాయించే ఒక చిన్న యంత్రమైపోవాలని తహతహ లాడిపోయారు. విద్యా పరీక్షలురాసి ఇంటికొచ్చిన తక్షణం ఆ యంత్రాన్ని 'స్టార్టు' చేసి రూపాయలు కక్కించాలని ప్రయత్నించేరు. ఆ ప్రయత్నంలో వాళ్ళు విజయాన్ని సాధించారు.

ఐదేళ్ళు ఈ ఉద్యోగమునే గయ్యాళి భార్యను అంటిపెట్టుకొనివుంటానని ఎగ్రిమెంటు రాయించి, అందులో తన సంతకం తీసుకొని, తనని ఉద్యోగంలో ప్రవేశపెట్టారు. ఈ ఉద్యోగంలో ఇక ఎదుగు బొదుగు లుండవు. గొర్రెతోక! కుక్కతోక!–దీన్ని వదలి మరో ఉద్యోగంలో చేరడానికి వీల్లేదు. వెయ్యి రూపాయలు చెల్లిస్తే, తమ ఇష్టం వచ్చినప్పుడు రిలీవ్ చేస్తారు! ఆ వెయ్యి రూపాయలు ఎవరిస్తారు? ఎందుకిస్తారు? తను దమ్మిడీ కూడబెట్టలేడు. తనింకెందుకూ పనికిరాడు. తనని నిర్జీవ పదార్థంచేసి పారేశారు. ఇక యిలా మృత్పిండంలా పడేవుండక తప్పదు. బంతిలా ఎగరాలని వుంటుంది తనకు. కానీ ఆ బంతిలో గాలి తీసేశారు! చిల్లులు పెట్టేశారు!

ప్రతినెలా జీతం అందేముందు తను ఎన్నిటికో తనకు అత్యవసరమైనవాటికి ఖర్చు పెట్టాలనుకొంటాడు. ఎన్నో కోరికలు కోరుకొంటాడు. తీరా జీతం వచ్చాక ఒక్కటీ చేయలేడు. అమ్మ, నాన్న, తమ్ముళ్ళు ఆదిగాగలవారు ఆ జీతానికి పదిరెట్లు ఖర్చుచేయడానికి పథకాలు వేసుకొని రెడీగా వుంటారు. రేపు జీతం వస్తుందనగా ఈ రోజే పీలుచూసుకొని ఎవరికివారు విడివిడిగా తమ బడ్జెట్ అంచనాలను అందజేస్తారు. వాటి నన్నింటినీ కూడుకొని ఏ పన్నెండుచేరనో భాగిస్తే తన జీతమంత అవుతుంది! అంటే ఏమన్నమాటా...తను జీతమందిన రోజు ఏ ఒక్కరి కోరికలూ తీర్చలేకపోతున్నాడన్నమాట! అందుచేత తనను అందరూ విసుక్కుంటున్నారు. ఏ ఒక్కర్నీ తృప్తిపరచడం లేదుగనక, ఏ ఒక్కరూ తనను ఇష్టంతో చూసుకోవడం లేదు.

అందరి కోరికలూ తీర్చడానికి జీతం చాలదంటే, ఆఫీసులో లంచం తీసుకోమని సలహాయిచ్చే తండ్రి...ఆయన తండ్రేనా? మనిషేనా! కొడుకును దుర్మార్గావలంబనకు ప్రోత్సహించే తండ్రి తండ్రేనా...అని!

తనభార్య! తన అర్ధాంగి! ఎటువంటి అద్భుతమైన మనిషి! కాపురానికి వచ్చిన రెణ్ణెల్లకి అన్నీ బోధపరచుకొంది. ఆవిడకూ ఎన్నో కోరికలున్నాయి. కానీ...అవి నెరవేరే అవకాశంలేదని తెలుసుకొంది. తన భర... మొగుడనేవాడు. మొగవాడనుకొనేవాడు...దద్దమ్మ...అని తెలుసుకొంది!! తెలుసుకొని తన ప్రాణం తీయక పూనుకుంది. తనను అన్నివిధాలా సంతోషపెట్టడానికి ప్రయత్నం చేస్తుంది. పూర్ ... డియర్! అమాయక పిల్ల!...తను... రామమూర్తి నామధేయుడు, పెళ్లయినపిల్లకోతి...తను నిజంగా ఎంత చవటవెధవ!! ఆ పని చేయవలసింది తనూ! భార్యను సుఖపెట్టవలసిన బాధ్యత...మగవాడై నటువంటి మగవాడు, మొగుడు అనుకొనే టటువంటి.. పెళ్లివాడు మహావీరుడైన, యుద్ధంచేసి రాజకుమారుని వశపరచుకొన్న పెళ్లికొడుకు పోజుపెటిన తనది! కానీ...తను తన విధ్యుక్తధర్మాన్ని సక్రమంగా నిర్వర్తిస్తున్నాడా? లేదు! నిర్వర్తించడం లేదు. లేనే లేదు. తను తన భార్యను అన్నివిధాలా సుఖపెడుతున్నాడా...అంటే లేదు:...సరే మరి ఏమని పెళ్లిచేసుకొన్నావు? ఏ ఉద్దేశంతో ఆమెను పెళ్లిచేసుకొన్నావు? ఆవిడను సుఖపెట్టా లనుకొన్నావా... అవును అనుకొన్నాను. మొదటిరాత్రి ఏం చెప్పావు. "నీ జీవితం స్వర్గతుల్యంచేసి, ఏమోమో చేసేస్తానని కోశావా? కోశావ్! మరి అలా దాన్ని కావ్యరూపంలో

రాజేంద్ర

# ★ మనిషివంటి మనిషి ★

...కట్టావా...? లేదు! లేదూ...మరి నువ్వు మగవాడివేనా...కాదు...మనిషివేనా....కాదు. మరి నువ్వేమిటి...అని? ఏమి కాదు!

ఒక...ఏమీ కాదు.

"మరి ఎందుకు రా నువ్వు...వెధవ గాడిదా...ఏమీ కానివాడా...చచ్చిపోరా! ఓరేయ్ చవటపీనుగా...చచ్చిపోతావూ...అసమర్థుడు, పిరికివెధవా...చస్తారు. నువ్వెందుకు చావాలి? నువ్వు చచ్చి నీ భార్యను మరింత హింసించావంటే, యమలోకమన్నదే వుంటే, నువ్వక్కడికి వెళ్లావంటే, ఈ ఘోరమైన తప్పిదానికి, నిన్నక్కడ మళ్లీ బాధించి, చంపేస్తారు! చస్తావు. చచ్చి మళ్లీ కుక్కగానో, గాడిదగానో, కొడిసుద్దుగానో పుడావు. పుట్టి మళ్లీ తిక్కచావు చస్తావు!"............

కొండక్రింద ఎత్తైన గుండుమీద కూర్చున్న రామ్మూర్తి జుత్తు పీక్కున్నాడు. తలబండకేసి బాదుకొన్నారు. మనశ్శాంతి కోసం ఊరవతల కొండ దరికి వచ్చిన రామ్మూర్తి మనసు మరీపాడు చేసుకొన్నాడు.

కొండమీద సూర్యుడు అస్తమిస్తున్నాడు. సాయం సంధ్యాకాంతి వింతగా ప్రకాశిస్తూ పరిసరాలకు మెరుగులు పెడోంది. ఆ ఎఱ్ఱటి కాంతిలో అతని చేతులు ఎంతో అందంగా అగుపిస్తున్నాయి. వేరుసెనగ చేలు కళకళ లాడుతున్నాయి. అతని మనసు ఆందోళనతో ఆక్రోశిస్తోంది

"తన దుస్థితికి ఎవర్ను...ఏది...ఎందుకు కారణం? బియ్యే చదువుకొని, చక్కని భార్యను చేసుకొని, ఉద్యోగం చేస్తూ...తను సుఖమవేదాన్ని ఎరక్కపోవటానికి ఎవరు కారకులు?

తన ఆర్థిక దుస్థితిమూలకంగా తను ఎన్ని కోరికలను చంపుకోవలసి వస్తోంది? జీవితం ఎంత దుర్భరంగా పరిణమిస్తోంది?

తను భార్యకు మంచి చీరకొనాలను కొన్నాడు. ఇంకా ఎన్నో బట్టలు టాయ్‌లెట్ వస్తువులు కొనాలను కొన్నాడు.

ఆవిడమంచి నెక్లెస్ ధరిస్తే ఎంతో బావుంటుంది. అలాంటి దొకటి కొనిచ్చి...ఆవిడ మెడలో వేసుకొని నవ్వితే, వెన్నెలలాంటి చిరునవ్వు నవ్వితే...చూసి...ఆనందభరితుడై కరిగిపోవాలని తను రహస్యంగా ఎన్నాళ్ళనుంచో అనుకొంటున్నాడు. ఇటీవల వెళ్ళిన ఆమె పుట్టినరోజుకు మంచి బహుమతి ఇవ్వాలను కొన్నాడు. ఏమీ ఇవ్వలేకపోయాడు. తనకోజత బట్టలు మంచివి...మన్నిక కలిగినవి కుట్టించుకోవాలను కొన్నాడు "ఎంకిపాటల" పుస్తకం కొనుక్కోవాలను కొన్నాడు. మంచికలం, మంచి జోళ్ళు, మంచి ఫౌంటెన్ మంచి చేతిసంచి...మంచి గొడుగూ ఎన్ని మంచివి అనుకొన్నాడు ఎన్ని సార్లు అనుకొన్నాడు? ఎందుకు కొనలేక పోయాడు.

వీటికోసం ఇంట్లో ఎవరూ ఏ ఖర్చు తగ్గించుకోలేరు. తను ఉద్యోగంలో చేరిన తక్షణం కొనుక్కోదలచినవి. ఎన్నో ఏళ్ళ నుంచి కోరుకొంటున్నవి...ఎంత గానో వాంఛించినవి...ఒక్కటి సంపాయించుకోలేకపోయాడు. అప్పటికీ ఇప్పటికీ...కోరికలు...కోరికలుగానే వుండిపోయాయి.

నాన్న నెలకు ఐదు రూపాయలు న్యూస్ పేపరుకు తనచేత చెల్లింపచేస్తాడు. లైబ్రరీకి వెళ్ళి చదుకోరాదూ? లైబ్రరీకి వెళ్లి చదువుకొంటే, గౌరవానికి భంగం కలుగుతుందా!...ఆ వ్యసనం మానేస్తే ఏం? తను సిగరెట్లు కాల్చడం ఎప్పుడో మానేయలేదూ! ఇంకా పటులాల్చీలెందుకూ? ఇంకా మంచి సెంటెడ్ హెయిరాయిల్ వాడితే గానీ ఈయన ముఖం ఎవరూ చూడరూ! ఆ పేకాట ఆడి కొంప తగలేయక పోతే, నెమ్మదిగా ఇంటి పనులేవో చూసుకోరాదు. మార్కెట్‌కు వెళ్లడం కూడా తనే చేయాలి. ఆయన ఇంటి పనులు జీవితంలో చేసి యెరగడట! అలాంటి వాటికోసం...ఇంకా నౌకరు మనుష్యుల మధ్య మసలవలసిన తను ప్రాకులాడవలసింది! అన్నీ అయిపోయిన ఆయన కెందుకు? ఇప్పుడైనా రోజుకు అర్థ డజనుసార్లు కాఫీలు త్రాగడం మానేయరాదూ? చుటలు కాల్చడం తగ్గించేస్తే ఏం? మానరయ్యా...బాబూ మానరు. తను చచ్చేవరకు మానరు. తను చావరు!...పైగా—

"నాకొడుకు సంపాదిస్తున్నాడు. నాకేం తక్కువయ్యా! నేనెందుకు మానేయాలి?" అంటూ వుంటాడాయన స్నేహితులతో.

అమ్మ ఇంకైనా ఆ దానధర్మాలు చేయడం మానేయరాదూ. కనీసం తగ్గించేయరాదూ! తమ్ముళ్ళు సినిమాలు, నాటకాలు, జల్సాలు తగ్గించేసే ఏం? పోనీ వాళ్లకతే సరదా అనుకోవచ్చు. ముసలివాళ్లకూ సరదాలే! తనకూ అలాంటి సరదాలు లేవూ" ఎప్పుడైనా ఎవరైనా "సినిమాలకు వెళ్లేం??" అని అడిగారూ! లేదు. ఎవరూ ఏది అడగరు పైగా "మావాడు బహుయోగ్యుడు! సినిమాలకూ వాటికీ వెళ్లడు. సిగరెటు కాల్చడు" అని చెప్పుకొంటూ వుంటారు.

తనకు ఇలాంటి భార్యగాని లేకపోయి వుంటే తను బ్రతికున్నాడో లేదోనయినా గమనించే వాళ్ళెవరు వుండి వుంటారు? తన భార్య కూడా చెడ్డదయివుంటే, తన బ్రతుకెలా వుండేది? మంచి మంచి బట్టలు కొనాలని, నగలు కావాలని, సినిమాలు తగ్గరాలు చూడాలని, అత్తమామల్ని భరించలేనని, ఈ చాకిరి చేయలేనని ... ఈ రాక్షస గోల భరించలేనని...అని వుంటే...హిరణ్యాక్షవరాలు కోరివుంటే...తన గతేమయ్యేది? తను పిశాచయి పోయేవాడు! తలచుకొంటే నే శరీరం గగుర్పొడుస్తుంది.

ఇలాంటి ఉత్తమురాలు తనకు భార్యగా లభించినందుకు, తనను సాహసించి పెళ్లి చేసుకొన్నందుకు, ఆమెకు లభించిన బహుమతి ఏమిటి? తన బహూకృతి ఏమిటి? ఏమీ లేదు. ఆక్షణం నుంచీ హింసిస్తూనే వున్నాడు. ఇంట్లో ఆమెకు స్వేచ్ఛ లేదు. సంతోషం లేదు. ఆమె సహజమైన కోరికలను ఎవరూ గుర్తించలేదు. తనూ ఖాతరు చేయలేదు. తను అంధుడు...మూర్ఖుడు...

ఎన్నాళ్ళిట్లా...?

అప్పుచేసి ఆమెకూ....తనకూ....కావలసినవన్నీ కొనేసి, ఇంట్లో ఎవరూ ఆమె జోలికి పోరాదని శాసిసే ఇంట్లో వాళ్ళుచేసే అప్పులు తనుతీర్చడం లేదూ! తండ్రి ఎప్పుడో బ్యాంకులో చేసిన అప్పుకు తను ప్రతినెలా చెల్లు పెటడం (జమకటడం) లేదూ! ఆయన మాత్రం తన పెనన్ డబ్బును ఖర్చుగా తనకే, తన అవసరాలు, కోరికలు కోసమే వాడుకోవటం లేదూ? ఇక మీదట తను అంతే!

తన, తనభార్య అవసరాలకే మిగిలిన డబ్బునే ఇంట్లో ఇవ్వాలి! అంతే! ఎప్పుడో కాదు...ఇప్పుడే—తమకు కావలసినవన్నీ కొనేయాలి. అప్పుచేసేయాలి. తరవాత ఎంత కాలానికి తీరుతుందో...తీరనీ గాక!

రామూర్తి అనే అవ్యక్తి ఆ ఎత్తయిన గుండుమీది నుంచి క్రిందికి, మెత్తటి ఇసకలోకి ఒక్క ఉదుటున ఉరికాడు. దుమ్ము దులుపుకొని పైకి లేచాడు. చుటూ చూసి ఒక్కక్షణం ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాడు. సంధ్యాకాంతిని కొంత తనలోనికి పీల్చుకొన్నాడు! ముందుకు... టౌన్ కేసి...నడిచాడు.

బజారులో మంచి పెద్దషాపులో ప్రవేశించాడు. షాపు యజమాని చిరపరిచితుడు! కూడా చదువుకొన్నవాడు.

"కూర్చోవోయ్ రామ్మూర్తీ! ఏమిటిలా దయచేశావు? సంపాయించే డబ్బంతా ఏంజేస్తున్నావోగానీ...ఇటు ప్రక్క రావటం లేదే! బ్యాంకులోగాని వేస్తున్నావేమిటి...ఊహుఁ..." అన్నాడు

"బ్యాంకూ లేదు....నా తలకాయా లేదు. జీతం పుచ్చుకొన్నరోజే అప్పిచ్చేవారి లెవరైనా వున్నారా అని బయలుదేరివచ్చాను" అన్నాడు రామమూర్తి.

"అప్పు...నీకు యివ్వలేనివాళ్ళెవరోయ్! ఏంకావాలి చెప్పు నేనిస్తాను" అన్నాడతను.

(55-వ పేజీ చూడండి)

# ★ మనిషివంటి మనిషి ★

(16-వ పేజీ తరువాయి)

రామ్మూర్తి వరసగా పట్టీప్రకారం చెప్పుకుపోయారు.

టాయ్‌లెట్ వస్తువులు...
టెంపిన్స్,
గొడుగు,
కలం,
సంచీ,
బెలు...
షేవింగ్ సెట్,
మిర్రర్ లేక అద్దం...పెద్దది...

వగైరా...వగైరా...అన్నీ తీసి సంచిలో వేసుకొన్నాడు. అంతా కలసి డెబ్భైఐదు రూపాయలు! అక్కణ్నుంచి బట్టలషాపుకు వెళ్లాడు. భార్యకు మంచి చీరలు...జాకెట్ గుడ్డలు వగైరా, తనకు రెండు మంచి చొక్కాలకు, పాంట్లకు గుడ్డ కొన్నాడు. అంతా కలిపి దాదాపు వందరూపాయలయింది. డబ్బు జీతం రాగానే యిస్తానన్నాడు. షాపు యజమాని వారానికోసారి ఆఫీసుకువచ్చేవాడు..'సరేసార్'అన్నాడు.— నగలదుకాణానికి వెళ్లాడు— రెండువందలఏభైరూపాయల ఖరీదులో మంచి నెక్లెస్ కొన్నాడు. 'ఇంట్లోవాళ్ళ'కు నచ్చకపోతే మార్చుకొనటానికీ, వాయిదాలపద్ధతిని డబ్బు తీసుకోవటానికీ షాపు యజమాని అంగీకరించాడు.

అన్నీ తీసుకొని, రిక్షాయెక్కి ఇల్లు చేరుకొన్నాడు:

రామ్మూర్తినాన్న పడకకుర్చీలో కూర్చుని న్యూస్ పేపర్ చూస్తున్నవాడల్లా, నోరు తెరుచుకొని విస్మయంతో రామ్మూర్తిని చూస్తూ వుండిపోయాడు.

రామ్మూర్తి, భార్యను పిలిచి గదిలోకి వెళ్లాడు.

"ఇవన్నీ ఏమిటి ... ఎలా తెచ్చారు" అందామె.

ఇవన్నీ...బజార్లో తెచ్చానే...అప్పు చేసి...! నిదానంగా తీర్చుకోవచ్చు. తొందరేమీ లేదు. ఏదీ ఈ నెక్లెస్ వేసుకో...ఈ చీర కట్టుకో...అబ్బ ఈ నెక్లెస్ ఎంత బావుంది నీకూ ... దివ్యంగా వున్నావుపో! ఇవన్నీ తీసుకో! నీకు...ఇంకా ఏం కావాలో చెప్పు. రిక్షా ఇంకా అక్కడే వుంది. వెళ్ళి తెచ్చేస్తాను. ఇంట్లో ఎవరైనా ఏమైనా అంటే చెప్పు...చంపేస్తాను... ఇప్పుడూ... నేను మనిషిని. నేనూ మనిషివంటి మనిషినే! నాకూ తెలుసు... నీకేమేం కావాలో నాకు తెలీదూ! తెలుసు! నీకూ నాకూ కావలసినవన్నీ తెచ్చేశాను. ఇంకా ఏం కావాలో చెప్పు. తెచ్చేస్తాను. స్వార్థపరులనీ, ఇంకా ఏమైనా అననీ... మనకై మిగిలిందే ఇంట్లో యిస్తాను..."


"ఏమండీ...ఏమైందిమీకు... మతి గానీ చలించలేదు కదా! అయ్యో! ఏమండో" ఆమె కంగారు పడుతోంది.

రామ్మూర్తినాన్న అక్కడికివచ్చి ఎర్రగా చూసి కళ్ళల్లో నిప్పులు కక్కుతూ.

"ఏమిట్రా—యివన్నీ! ఎంత తగలేశావు. ఎక్కడ తెచ్చావు. చెప్పు" అని అరిచాడు.

"అప్పుచేసి బజార్లో తెచ్చాను"అన్నాడు ధీమాగా నిల్చుని మొదటిసారి సూటిగా తండ్రి కళ్లలోకి చూస్తూ!

"ఏడిశావ్! నీకు మతిచెడిందిలే! హాస్యంగా ఏమీ చెప్పలేదు. రెండ్రోజుల్నించి చూస్తున్నా వాలకం. డాక్టర్ని పిలుస్తానుండు..." అని ఆయన గబగబా వీధిలోకి నడిచాడు. రామ్మూర్తి బిగ్గరగా నవ్వుతూ గంతులేశాడు. భార్యను కొత్త చీరచుట్టబెట్టి కౌగలించుకున్నాడు! ★




be Bright—Call Madras 55965